www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 18 జూన్ 2024



ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా కరుణాకర్



ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లాకు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులుగా మదనపల్లికి చెందిన డాక్టర్ కరుణాకర్ ఆరమడక నియమితులయ్యారు. ఈ మేరకు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర అధ్యక్షులు జె.ఎస్.రాజేంద్ర, కేంద్ర కార్యదర్శి వాసవి సోమవారం నియామక పత్రాన్ని అందించారు. 2024 జూన్ 17 నుండి 2025 జూన్ 16 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సినీ హబ్ నిర్మాణానికి ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎంతో కృషి చేస్తూందని రాష్ట్ర అధ్యక్షులు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో షూటింగ్‌లకు అనువుగా ఎన్నో అతి సుందరమైన ప్రదేశాలున్నాయని, సక్రమ మార్గంలో తన వంతుగా బాధ్యతలు నిర్వర్తిస్తానని చెబుతూ, తనను అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించిన ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కి డాక్టర్ కరుణాకర్ ఆరమడక ధన్యవాదాలు తెలుపుకున్నారు.

త్యాగానికి, ప్రేమకు ప్రతీక బక్రీద్

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న మతపెద్దలు, ముస్లిములు

ప్రజాశక్తి-రాయచోటి

సమాజ హితం కోసం మహమ్మద్ ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగ దానం, సాయం, త్యాగం వంటి సుగుణాలను ప్రతిబింబింపజేస్తుందని ఈ పండుగ సమస్త మానవాళికి ఆదర్శనీయమని రవాణా యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా రాయచోటి పట్టణంలోని ఈద్గాలో ముస్లిం సోదరులు నిర్వహించిన సామూహిక ప్రార్థనలలో రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపు కుంటా రన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని సంక్షేమ పాలనలో ముఖ్యమంత్రికి అల్లా ఆశీస్సులు ఉండాలని ఆకాక్షించారు. ప్రతి మనిషి తనకు ఉన్నంతలో తోటి మనిషికి సాయం అందించే స్వభావాన్ని అలవర్చుకోవాలని మంత్రి ప్రజలకు సందేశానిచ్చారు. బక్రీద్ ప్రార్థన అనంతరం మంత్రి రాష్ట్ర ప్రజలకు శుభాకాక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాయచోటి పట్టణంలోని ముస్లిం మత పెద్దలు, ముస్లింలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. **రాయచోటి టౌన్ :** పట్టణంలో బక్రీద్ వేడుకలు ఘనంగా జరిగాయి. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని హజరత్ జామాలుల్లా బాషా ఈద్గాలో మతగురువు సర్మాజ్ నర్మద్దీన్ ఆధ్వర్యంలో సామూహిక మత ప్రార్థనలు నిర్వహించారు. ఈ ప్రార్థనలకు రాజకీయ ప్రముఖులతో పాటు వేలాది సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈద్గా వక్ఫ్ కమిటీ అధ్యక్షులు బేపారి మహమ్మద్‌ఖాన్, ముస్లింలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** మండల పరిధిలో బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం మైనార్టీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. నిమ్మనపల్లి, కొండయ్యగారిపల్లె, సైదాపేట, రాచవేటివారిపల్లె, చౌకిళ్ళవారిపల్లె, ముష్టూరు, చల్లావారిపల్లె, సింగంవారిపల్లె, సళీసుందవారిపల్లె, తురకపల్లె తదితర గ్రామాల్లో పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కలకడ:** బక్రీద్ పండుగను మండలంలోని కలకడ, కోన, నడిమిచర్ల పాపిరెడ్డిగారిపల్లె, ఎర్రకోటపల్లె, ఎర్రయ్య గారిపల్లి తదితర గ్రామాలలో ముస్లిం సోదరులు త్యాగానికి మారుపేరుగా నిర్వహించుకున్నారు. అనంతరం ముస్లిం సోదరులు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **కలికిరి:** కలికిరిలో బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. బక్రీద్ వేడుకలు పురస్కరించుకొని కలికిరి క్రాస్ రోడ్‌లోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులంతా నమాజు చేసుకొని భక్తిశ్రద్ధలతో అల్లాను స్మరించుకున్నారు. **బి.కొత్తకోట:** త్యాగానికి ప్రతీకే బక్రీద్ పర్వదినమని, ఇబ్రహీం ప్రవక్త చూపిన మార్గం ముస్లింలకి ఆదర్శనీయమని ముస్లిం మత పెద్దలు, ప్రముఖులు పేర్కొన్నారు. పట్టణంలోని పిటిఎం రోడ్డులోని ఈద్గా వద్దకు వందలాది మంది ముస్లింలు వేకువ జామునే చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. **పీలేరు:** బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగానికి ప్రతీకగా చెప్పుకునే ఈ పండుగ సందర్భంగా మదనపల్లి మార్గంలోని బోదేషా వలి దర్గా వద్ద ఉన్న ఈద్గా మైదానంలో సామూహిక నమాజును ఆచరించారు. **సుండుపల్లి:** బక్రీద్ పండుగ వేడుకలను ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కార్యక్రమంలో రెహమాన్ పాల్గొన్నారు. **నందలూరు:** మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ జామియా మజీద్ ఈద్గాలో త్యాగానికి ప్రతీక అయిన పవిత్ర బక్రీద్ పండుగను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. ముస్లిం సోదరులకు ఈద్-ఉల్-ఫితర్ బక్రీద్ శుభాకాంక్షలను మండల కో-ఆప్షన్ సభ్యులు కరీముల్లా ఖాన్ తెలిపారు. **పెద్దమండ్యం :** మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీ జామియా మజీద్ ఈద్గాలో త్యాగానికి ప్రతీక అయిన పవిత్ర బక్రీద్ పండుగను భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. **మదనపల్లె అర్బన్ :** ప్రవక్త ఇబ్రహీం త్యాగ నిరతికి బక్రీద్ పండుగ పరమార్థమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని స్థానిక బెంగుళూరు రోడ్డులోని ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు నిస్సార్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు రెడ్డి సాహెబ్ పాల్గొన్నారు. **చిన్నమండెం :** ఈద్గాలో ముస్లిం సోదరులు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఐక్యమత్యమునకు ప్రతీకగా జరుపుకునే పండుగే బక్రీద్ పండుగని ముస్లిం సోదరులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. **గాలివీడు :** మండలంలోని 17 గ్రామాలలోని ఈద్గా వద్ద ఘనంగా బక్రీద్ పర్వదినాన్ని జరుపుకున్నారు. **వాల్మీకిపురం:** స్థానిక బైపాస్ రోడ్డు, నమాజ్‌కట్టవీధి, హసన్‌ఖాన్‌వీధి, పునుగుపల్లె, దింతపల్లి, గండబోయనపల్లె తదితర గ్రామాల్లోని మసీదులు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.



పీలేరు : ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు



బి.కొత్తకోట : సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులు



నిమ్మనపల్లి : ఈద్గా వద్ద బక్రీద్ పర్వదిన ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

సమస్యల వలయంలో మినీ గురుకులం

- బడి వైపు కన్నెత్తి చూడని ప్రాజెక్టు ఆఫీసర్
- రెగ్యులర్ హెచ్‌ఎం లేక అవస్థలు
- సిలబస్ పూర్తి చేయడంలోనూ నిర్లక్ష్యం
- నర్స్ లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



అనంతరాజుపేటలోని మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాల

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తమ పిల్లలకు విద్యా బుద్ధులు నేర్పిస్తారని కొండంత ఆశతో విద్యార్థులను గురుకులానికి పంపుతున్న గిరిజన తల్లితండ్రులకు నేడు నిరాశే మిగులుతుంది. ప్రభుత్వం ఎంతో ఉన్నతాశయంతో ఏర్పాటు చేసి నడుపుతున్న మినీ గురుకులం నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా పట్టించుకొనే నాథుడే కరువయ్యారు. రైల్వేకోడూరు మండల పరిధిలోని అనంతరాజుపేట పంచాయతీలోని మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాలలో సుమారు 180 మందికిపైగా విద్యార్థులు హాస్టల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి చిట్వేలు, పుల్లంపేట మండలాల్లో గిరిజనులు (యానాదులు) 30 వేలకుపైగా జీవనం సాగిస్తున్నారు. వీరి కుటుంబాల్లోని విద్యార్థులకు నాణ్యమైన వసతితో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో గతంలో ప్రభుత్వం మినీ గురుకులం ఏర్పాటు చేసింది. పాఠశాలలో చేరే బాలికల సంఖ్య క్రమంగా ప్రతి ఏటా పెరుగుతుంది. 2011 నుంచి పాఠశాలను ప్రారంభించారు. గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. వంట మనిషి, నర్స్, అరకొర విద్యా బోధన, శాశ్వత ప్రధానోపాధ్యాయులు వంటి సమస్యలు ఉన్నారు. గురుకులానికి చాలా కాలంగా పర్మినెంట్ హెచ్‌ఎం లేక ఏళ్ల తరబడి ఇన్‌ఛార్జితోనే కొనసాగడంతో అజమాయిషీ కరువై ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయుల్లో భాధ్యత కొరవడి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాలుగవ తరగతి ఉద్యోగులైన వంట మనిషులకు సరైన వేతనాలు ఇవ్వకపోవడంతో ఎవరు కూడా విధుల్లో చేరిన పది రోజులు కూడా ఉండటం లేదు. వంట చేసే సందర్భంలో విద్యార్థులే వంట మనిషి పాత్ర పోషిస్తున్నారు. విద్యార్థులు వంట సహాయకులుగా ఉంటుండటంతో వారి విద్య కుంటుపడుతోంది. కొందరు ఉపాధ్యాయుల వల్ల బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులను కులం పేరుతో దూషించడం, అసభ్యంగా మాట్లాడటం, సక్రమంగా పాఠాలు బోధించడంలో కొందరు ఉపాధ్యాయుల్లో నిర్లక్ష్యం దోరణి ఎక్కువగా ఉంటోంది. ఉపాధ్యాయులు తమ పిల్లలను స్కూలుకు తీసుకురావడంతో సిలబస్‌పై దృష్టి సారించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోధించడానికి ఇబ్బందిగా మారి వారి పిల్లలను ఆలన పాలనలో ఎక్కువ సమయం గడుపుతూ సిలబస్ బోధించే విషయం పూర్తిగా విఫలమైందనే విమర్శ ఉంది. గత ఏడాదిలో పూర్వ విద్యార్థులు ఇప్పుడు ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చేరే బాలికలు ఆందోళనల వ్యక్తం చేస్తున్నారు. సోషియల్, హిందీ, మ్యాథమెటిక్స్ పూర్తిస్థాయిలో బోధించకుండా ఆన్‌లైన్ క్లాసులు వినమని చెప్పడంతో విద్యార్థులు విసుగెత్తి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదో తరగతిలో మార్కులు చాలా తక్కువ రావడంతో ఎంపిసి, బైపిసి సబ్జెక్టులు తీసుకునే పరిస్థితి లేదు. ఆర్ట్స్ గ్రూప్ తీసుకొని మేము ఇంటర్‌లో చేరుతున్నామని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక దృష్టి పెట్టాలని ఇప్పుడు చదువుతున్న బాలికలకు సరైన చదువు చెప్పాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇన్ని సమస్యలు ఇక్కడ తిష్ట వేసినా నెల్లూరులో ఉంటున్న ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం బాధాకరం. మినీ గురుకుల గిరిజన బాలికల సమస్యలపై ఎప్పుడు పరిష్కారం చేయాలనే ఆలోచన చేయకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రాజెక్టు అధికారికి చీమ గుట్టినట్లు లేకపోవడం చాలా దారుణమని గిరిజన సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్స్ లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడినప్పుడు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గత విద్యా సంవత్సరం నుండి పైసమస్యలు గురుకులంలో తిష్ట వేసినప్పటికీ విద్యార్థులు సర్దుబాటు చేసుకుని విద్యాభ్యాసం కొనసాగుతున్నారు. ఇప్పుడు కూడా ఆ పరిస్థితి కనబడుతుంది. ఇప్పటికైనా ఇక్కడ నెలకొన్న సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బాలికల తలితండ్రులు కోరుతున్నారు.

సమస్యలను పరిష్కరిస్తాం



నాలుగో తరగతి ఉద్యోగులు సమస్య ఉంది. ఈ ఏడాది ఆ సమస్య రాకుండా ఉండేందుకు పరిష్కారం కోసం కృషి చేస్తా. పాఠశాలలో ఉపాధ్యాయులు సిలబస్‌ను పూర్తి చేసి విధంగా చర్య తీసుకుంటా. బాలికలకు మంచి విద్య అందించడానికి నా వంతు నేను కృషి చేస్తా.

- బి.లతలి, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం, మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాల, రైల్వేకోడూరు.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి



గిరిజన విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల్ని తక్షణమే శాశ్వత ప్రాతిపదికగా పరిష్కరించాలి. అక్కడ ఖాళీగా ఉన్న పోస్టులు వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు పనిభారం లేకుండా, భద్రత కల్పించాలి. పోషకాహారం అందివ్వడంతో పాటు ఉపాధ్యాయుల ఇష్టారాజ్యానికి ఫుల్ స్టాప్ పెట్టాలి. లేకపోతే విద్యార్థుల తల్లితండ్రులతో కలిసి ఆందోళనలు చేపడతాం.

- జలకం శివయ్య, జిల్లా అధ్యక్షులు, యానాదులు (గిరిజన) సంక్షేమ సంఘం, అన్నమయ్య జిల్లా.

సిఐటియును బలోపేతం చేసినప్పడే 'పర్స'కు నిజమైన నివాళి

- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు



పర్స సత్యనారాయణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

సిఐటియు సంఘాన్ని బలోపేతం చేసినప్పుడే కార్మికోద్యమ నేత తెలంగాణ సాయుధ పోరాట యోధుడు పర్స సత్యనారాయణకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు అన్నారు. సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ అధ్యక్షతన పర్స సత్యనారాయణ శత జయంతి సభ నిర్వహించారు. పర్సా సత్యనారాయణ చిత్రపటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ పర్స, నండూరి ప్రసాదరావు ఇద్దరు కలిసి నిర్మించిన సంఘమే సిఐటియు అని తెలియజేశారు. నిర్మాణం కోసం చాలా కాలం కృషి చేశారని తెలియజేశారు. పర్సా సత్యనారాయణ గుంటూరు జిల్లా కంభంపాడు గ్రామంలో జన్మించారని, ఆయన వృత్తి కోసం సింగరేణి బొగ్గు గనుల దగ్గరికి వెళ్లారని పేర్కొన్నారు. అక్కడ పనిచేస్తూనే సింగరేణి కాలరీస్‌లో కార్మిక సంఘాన్ని ఎంతో కష్టపడి నిర్మించారని తెలిపారు. తర్వాత ఆయన అనేక కష్టాలు ఎదుర్కొన్నారని అనేక సంవత్సరాల పాటు అజ్ఞాత జీవితం గడపవలసి వచ్చిందని పేర్కొన్నారు. పర్స అనేక సంవత్సరాల పాటు కుటుంబానికి దూరంగా ఉన్న వారి కుటుంబ సభ్యులు ప్రధానంగా ఆయన భార్య భారతి కుటుంబాన్ని పోషించుకుంటూ పర్సాకు తోడుగా నిలబడ్డారని తెలిపారు. పర్స ఆంధ్రప్రదేశ్ సిఐటియు అధ్యక్షులుగాను, గౌరవ అధ్యక్షులుగానూ, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులుగానూ కార్మికులోకం సంపాదికుడుగానూ అనేక సంవత్సరాలు పనిచేశారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సిఐటియు ఉద్యమం విస్తరించడానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని కొనియాడారు. ఆయన తొమ్మిదేళ్లపాటు జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. శాసనసభ సభ్యులుగా కొనసాగుతూనే ఆ రోజుల్లో విశాఖ ఉక్కు కోసం శాసనసభ సభ్యత్వాన్ని త్యాగం చేసిన ఘనత ఆయనకే దక్కిందని చెప్పారు. ఆయన ఉన్నంతకాలం అత్యంత నిరాడంబర జీవితాన్ని గడిపారని తెలియజేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటికీ కార్మికులకు ఒరిగింది ఏమి లేదని, కొత్తగా ఏర్పడే ప్రభుత్వం అనుసరించే విధానాలను బట్టి మన పోరాటాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రజావ్యతిరేక విధానాలు గనుక అనుసరిస్తే అందుకు తగిన రీతిలో ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు నిర్వహించామని తెలిపారు. ఆ ఉద్యమాల ఫలితంగానే మతతత్వ ప్రభుత్వ దూకుడు తగ్గించడానికి ప్రయత్నించామని పేర్కొన్నారు రాబోవు కాలంలో అంతకంటే ఎక్కువ ఉద్యమాలు నిర్వహించాల్సిన అవసరం ఇంకా ఉందని తెలిపారు. లేబర్ కోడ్‌లను ఇప్పటికీ ప్రభుత్వం రద్దు చేయలేదని ప్రభుత్వం రద్దు చేసేంతవరకు మనం పోరాటం చేయవలసిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి డి.భాగ్యలక్ష్మి ఉపాధ్యక్షులు సి.రవికుమార్, పి.శ్రీనివాసులు, డి.వెంకట్రామయ్య, పి.రాజేశ్వరి, రెడ్డెప్ప, ఎస్.శ్రీలక్ష్మి, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కె.సుబ్రహ్మణ్యం రాజు, జి.బోగేశ్వరయ్య, వై.సుజాత, ఎం.పరంజ్యోతి పి.ప్రసాద్, గౌరీ, మధురవాణి, నాయకులు నందకుమార్, మాధవయ్య, చెన్నయ్య పాల్గొన్నారు.



సుండుపల్లెలో అక్రమంగా నిర్మిస్తున్న గోడ

అక్రమ కట్టడాలకు అడ్డుకట్ట పడేదెన్నడో?

- నిద్రావస్థలో రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి-సుండుపల్లి : ప్రభుత్వం మారినా అధికారులు మారడం లేదు. ఎపిలో ఎన్నికలు జరిగి నూతన ప్రభుత్వం ఏర్పడినా అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లి మండలంలో అధికారులు మాత్రం వైసిపి వారికే ఇంకా కొమ్ము కాయడం హాస్యాస్పదం. టి.సుండుపల్లి మండలంలో ఎంతో విలువైన ప్రభుత్వ భూములు, వంక పరంబోకులను యథేచ్ఛగా ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేస్తున్నారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు చెప్పినా వారి మీద చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ భూములు కాపాడడానికి ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. సుండుపల్లి మండల అధికారులు ఇలాగే మొద్దు నిద్ర వీడకుంటే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి అందరి మీద చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఇకనైనా అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సిందేనా.

వైభవంగా ద్రౌపది మాత కల్యాణోత్సవం

ప్రజాశక్తి-రామాపురం : మండల కేంద్రమైన రామాపురంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం ద్రౌపదిమాత కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వించారు. ద్రౌపదీమాత తరుపున మద్దిరివుల రమేష్‌రెడ్డి దంపతులు పాండవుల తరపున అయోధపురం భగవాన్‌రెడ్డి దంపతులు పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవానికి మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డి పాల్గొని ద్రౌపది మాత కల్యాణోత్సవాన్ని తిలకించి పండితులతో ఆశీర్వాదం పొందారు. మండలంలోని ప్రజలు హాజరై కల్యాణ ఉత్సవాన్ని తిలకించారు. అనంతరం కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు అన్నదానం చేశారు.

200 మందికి అన్నదానం

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన మహాభారత యజ్ఞం కాలక్షేప హరిత గాన కోకిల జి.వరలక్ష్మి నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉత్తర గోగ్రహనం హరికథ కాలక్షేపానికి హాజరైన సుమారు 200 మంది గ్రామస్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, దాతలు సాయిలోకేష్, పజలు పాల్గొన్నారు.

ప్రయివేటు పాఠశాలలకు సిబిఎస్ఇ గుర్తింపు లేదు : ఎంఇఒ

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు మండల పరిధిలో ఏ ఒక్క ప్రయివేటు పాఠశాలకూ సిబిఎస్ఇ గుర్తింపు లేదని ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. తనను కలిసిన విద్యార్థి సంఘాల నాయకులతో సోమవారం ఆయన మాట్లాడుతూ పీలేరు మండలంలోని తపశ్య స్కూల్‌తో సహా ఏ ప్రయివేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలకు సిబిఎస్ఈ గుర్తింపు లేదని పీలేరు మండల విద్యాశాఖాధికారి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎన్‌ఒసి వచ్చినంత మాత్రాన సిబిఎస్ఇ గుర్తింపు వచ్చినట్లు కాదని, సిబిఎస్ఇ నుండి ప్రత్యేక గుర్తింపు నెంబర్ కేటాయింపు ఉండాలని పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యార్థుల తల్లిదండ్రులు జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఏవైనా సందేహాలు ఉంటే విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'మండిపల్లి'తో 'చౌప్పా' భేటీ దేనికి సంకేతం...?



రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో చౌప్పా ఎల్లారెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

నిన్నటిదాకా ఆయన కరుడుగట్టిన వైసిపి నాయకుడు. అలాంటి వ్యక్తి అకస్మాత్తుగా టిడిపి నాయకుడిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఈ విషయం చర్చనీయాంశమైంది. వివరాల్లోకి వెళితే.... అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి పార్టీ ఆవిర్భావం నుంచి వైసిపితో కలిసి నడిచారు. ఇటీవలే అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాల యూనివర్సిటీగా గుర్తింపు పొందింది. చొప్ప ఎల్లారెడ్డి రాయచోటి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా పగ్గాలు చేపట్టిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సోమవారం రాయచోటిలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం, జ్ఞాపికను అందజేయడంతో సర్వత్రా చర్చనీయాంశమైంది. రెండు రోజుల క్రితం చొప్పా సోదరులు గంగిరెడ్డి, యల్లారెడ్డి వైసిపి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం కూటమి మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలపడంతో అటు టిడిపి శ్రేణుల్లోనూ, విద్యార్థి సంఘాల నాయకుల్లోనూ అయోమయం నెలకొని సామాజిక మాధ్యమాలలో ఘాటైన విమర్శలు చేస్తున్నారు. అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలను పరిరక్షించుకునేందుకే చొప్పా సోదరులు దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు.

అక్రమ ఆస్తుల రక్షణకే టిడిపి గూటికి : ఎస్‌ఎఫ్‌ఐ

చొప్పా సోదరులు ఆక్రమించిన ఆస్తుల రక్షణకే టిడిపి గూటికి వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సర్వేపల్లి ఆరోపించారు. తాళ్లపాక రెవెన్యూకు చెందిన డికెటి స్థలాన్ని ఆక్రమించి చొప్పా సోదరులు కళాశాల నిర్మించారని, స్మశానం, విద్యుత్తు సబ్ స్టేషన్‌లు సైతం కళాశాల ఆవరణలోనే ఉండడం, డొనేషన్ల రూపంలో విద్యార్థుల నుంచి లక్షలాది రూపాయలు వసూళ్లు చేయడం, ఫిట్నెస్ సక్రమంగా లేని కళాశాల బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను తరలించడం వంటి కళాశాల మాటున జరుగుతున్న అనేక అక్రమాల నుంచి తప్పించుకునేందుకే చొప్పా సోదరులు టిడిపి గూటికి వెళ్లేందుకు అడుగులు వేస్తున్నారని విమర్శించారు. రాజకీయాలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే విద్యార్థి సంఘాలు చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

117 జిఒను రద్దు చేయాలి : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-కలికిరి

గత ప్రభుత్వం ఏకపక్షంగా తెచ్చిన 117 జిఒ పాఠశాలల మనుగడకు ముప్పు తలపెట్టే 3, 4, 5 తరగతులు విలీనం చేసే ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని ఎపి టీచర్స్ ఫెడరేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు కుమార్ యాదవ్ ప్రభుత్వానికి సూచించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ తరగతులు విలీనం చేయడం ద్వారా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి పాఠశాలల మూసివేతకు గురై గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందని తెలిపారు. ఇది విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకమన్నారు. ప్రతి గ్రామంలోనూ బడి అందుబాటులో ఉండేలా, సరిపడా ఉపాధ్యాయులు నియామకం చేసి నాణ్యమైన విద్యను అందించే చర్యలు చేపట్టాలని కోరారు. 117 జిఒ వలన బడులు మూసేయడంతో పాటు ఉపాధ్యాయుల పోస్టులు రద్దయి నిరుద్యోగులకు తీవ్రనష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయలోకం ఎంత వద్దని మొత్తుకుంటున్నా గత ప్రభుత్వం మొండిగా అమలు చేసిందని దాన్ని ప్రజలూ గుర్తించారన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులైన నాడు-నేడు, పథకాల ఫోటోలు, ఆన్‌లైన్ పనుల భారం నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ఇతరత్రా పనులు అప్పగించి, ఏకోపాధ్యాయులుగా కొనసాగించడం వలన విద్యార్థులకు విద్య అందించే లక్ష్యం నెరవేరదని, తద్వారా ప్రధానంగా గ్రామీణ పేదలకు తీవ్రనష్టం వాటిల్లుతుందని తెలిపారు. పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్‌ను తప్పించాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిలను కనీసం పట్టించుకోకుండా, సరైన సౌకర్యాలు కల్పించకుండా, సమస్యలను పరిష్కరించకుండా ప్రచారయావత, కక్షసాధింపు వలే వ్యవహరిస్తూ ఉపాధ్యాయుల ఆత్మస్థైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న ఆయనను బాధ్యతలనుండి తప్పించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు

కోళ్లబైలు పంచాయతీలో భూకబ్జాలు అరికట్టాలి

ప్రజాశక్తి -మదనపల్లె అర్బన్

మదనపల్లె రూరల్ మండలం, కోళ్లబైలు పంచాయతీలో భూకబ్జాలు అరికట్టాలని సోమవారం కాలనీ వాసులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇది ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన కూడా ఆ స్థలాన్ని కబ్జారాయుళ్లు యథేచ్ఛగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రజా పాలకులు, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి భూ కబ్జా దారులుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోళ్ల బైలు పంచాయతీ బయ్యారెడ్డి కాలనీ సమీపంలో సర్వే నెంబర్ 612, 529లలో రెవెన్యూ సిబ్బంది కొంత ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసినప్పటికి సదరు స్థలంపై కన్నేసిన కొందరు నకిలీ పట్టాలు తయారు చేసుకుని రాత్రిళ్లు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం కబ్జాదారుల ఆటలకు వత్తాసు పలికారని కనీసం ఇప్పుడైనా టిడిపి ఎమ్మెల్యే దీనిపై ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కాలనీకి అవసరమయ్యే కమ్యూనిటీ హాలు, పార్కు లాంటివి నిర్మించుకునేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

29న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం జరుగుతుందని మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గాన కేసులు పరిష్కరించుకోవచ్చని ఈ అవకాశాన్నికక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీకి అవకాశం ఉన్న కేసులన్నీ కక్షిదారులు,న్యాయవాదులు, పోలీసులను సంప్రదించి కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు.

మల్లయ్య కొండపై భక్తుల సందడి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం భక్తుల సందడి నెలకొంది. పూజారులు, ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. కొండపైన భక్తులకు అన్నదానం చేశారు.

విద్యుదాఘాతంతో బొప్పాయి లారీ దగ్ధం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు



కాలిపోతున్న లారీ

మండలంలో సోమవారం బొప్పాయి లోడుతో వెళుతున్న లారీకి విద్యుత్ తీగలు తగలడంతో మంటలు చెలరేగి మహిళ కార్మికురాలు మంజుల (38) మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు కోడూరు మండలం అనంతరాజుపేట గ్రామ పంచాయతీ వడ్డేపల్లి గ్రామ సమీపంలో బొప్పాయి లోడుతో వస్తున్న లారీ హైటెన్షన్ విద్యుత్ తీగలు తగల డంతో మంటలు జలరేగాయని, ఈ మంటలలో బొప్పాయి మహిళా కార్మికురాలు మంజుల మృతి చెందగా వెంకటసుబ్బమ్మ అనే కార్మికురాలు తీవ్రంగా గాయపడగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మ ృతురాలు మంజుల కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం తుగ్గి మండలం సూర్య తండాకు చెందినదిగా సమాచారం తగలబడుతున్న లారీ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేలోగా దాదాపు లారీ పూర్తిగా కాలిపోయినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కుటుంబ సంక్షేమ పథకం రాష్ట్ర ట్రెజరర్‌గా లక్ష్మీరాజ

ప్రజాశక్తి-కడప అర్బన్

యుటిఎఫ్ రాష్ట్ర మధ్యంతర కౌన్సిల్ సమావేశాలు నెల్లూరు పట్టణంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి స్మారక విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు నిర్వహించారు. ఈ సమావేశాలలో యుటిఎఫ్ రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకాన్ని రాష్ట్ర సంఘం ప్రవేశపెట్టింది. ఈ పథకానికి రాష్ట్ర ట్రెజరర్‌గా కడప జిల్లాకు చెందిన రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఎన్నిక పట్ల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధన విజయకుమార్, పాలెం మహేష్ బాబు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర కుటుంబ సంక్షేమ పథకంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్లు, జిల్లా ఆఫీస్ బేరర్లు సభ్యులుగా ఉంటారని ఇందులో సభ్యత్వం కలిగిన ఉపాధ్యాయులు మరణించినా, ప్రమాదాలలో తీవ్రంగా గాయపడినా, అనారోగ్యాల పాలైన ఆర్థికంగా ఆదుకుంటారని తెలిపారు. కుటుంబ సంక్షేమ సంఘం ఉపాధ్యాయుల కుటుంబానికి భరోసాను కల్పించే విధంగా ఉంటుందని, ఈ పథకంలో సభ్యులైన వారు 75 సంవత్సరాల వయస్సు వరకు కొనసాగవచ్చునని తెలిపారు.

మంత్రి 'మండిపల్లి'ని కలిసిన ఎన్‌జిఒ నాయకులు



మంత్రిని సన్మానిస్తున్న ఎన్‌జిఒలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డిని రాయచోటిలో ఎపి ఎన్‌జిఒ నాయకులు, ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపా ధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి.రవికుమార్, రాయచోటి తాలూకా అధ్యక్షులు ఎం.వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శి డి.వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యోగులకు ఎలాంటి సమస్యలున్నా మీకు అండగా ఉంటానన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి కడప జిల్లా కోశాధికారి పి.నిత్యపూజయ్య, ఉపాధ్యక్షులు టి.శ్రీనివాసులు, నరసింహ రెడ్డి, యన్.రాజశేఖర్, రాయచోటి ఎన్‌జిఒ నాయకులు బి.దేవేంద్ర, మహాదేవ, గణేష్ యాదవ్, అల్లీ బాష, కడప సిటీ అధ్యక్షులు కె.చిన్నయ్య, కార్యదర్శి శైలె శ్వర్‌రెడ్డి, నాగార్జున రావు, పద్మనాభరావు, లక్కిరెడ్డిపల్లి అధ్యక్షులు కె.బలరామ రాజు, ఉపాధ్యక్షులు సి.విశ్వనాథం పాల్గొన్నారు.

తెలుగు లిపి పరిణామ

పరిశోధనలో మేటి 'తిరుమల రామచంద్ర'

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సోమవారం ఉదయం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో తిరుమల రామచంద్ర 112వ జయంతిని నిర్వహించింది. ముందుగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ పాత్రికేయులుగా, సంపాదకులుగా, కవిగా, నాటకకర్తగా, విమర్శకులుగా, భాషావేత్తగా, అనువాదకులుగా అనేక ప్రక్రియల్లో రచనలు చేసినప్పటికీ తిరుమల రామచంద్ర తనను తాను ఎంతో వినయంతో 'భాషా సేవకుడను' అని అభివర్ణించుకునేవారన్నారు. తిరుమల రామచంద్ర శ్రీకృష్ణదేవరాయల కులగురువైన తిరుమల తాతాచార్యుల వంశీకులని, ఆయన తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృత, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహుభాషావేత్త అని అన్నారు. ఆయన పలురకాల వృత్తులు చేయడం ద్వారా, భారతదేశంతోపాటు ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్ వంటి దేశాలు తిరిగి, వివిధ సంస్కృతుల పట్ల చక్కని అవగాహన ఏర్పరచుకున్నారని అన్నారు. ఆయన విద్యార్థిదశలో గాంధీని చూసి ప్రభావితులై స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలుకు వెళ్ళారని అన్నారు. ఆయన ఇతర భాషల్లోని పలు రచనలను తెలుగులోకి అనువదించిన గొప్ప అనువాదకుడని అన్నారు. గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు మాట్లాడుతూ తిరుమల రామచంద్ర ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి ,హిందుస్తాన్ సమాచార్, భారతి పత్రికలలలో వివిధ హోదాలలో పనిచేశారని, పరిశోధన అనే ద్వెమాసపత్రికకు సంపాదకత్వం వహించారని అన్నారు. రచయిత కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడుతూ రామచంద్ర మనిషి రూపంలోని విజ్ఞాన సర్వస్వమని, నిరాడంబరంగా ఉంటూ ఎప్పుడూ ఖద్దరు వస్త్రాలు ధరించేవారని అన్నారు. ఆయన రచించిన నుడి, నానుడి, మనలిపి పుట్టుపూర్వోత్తరాలనే గ్రంథాలు భాషాశాస్త్రంలో చాలా విలువైన గ్రంథాలని అన్నారు. 'సరస్వతీపుత్ర' పుట్టపర్తి నారాయణాచార్యులు, రామచంద్ర తిరుపతి శ్రీవేంకటేశ్వర సంస్కృత కళాశాలలో కలిసి చదువుకున్నారని అన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులు రంగా, రాజేష్, దిలీప్, నాగరాజు పాల్గొన్నారు.



రామచంద్ర చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపి.బ్రౌన్ గ్రంథాలయ సిబ్బంది

చిరస్మరణీయులు చిలకమర్తి లక్ష్మీ నరసింహం

- ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి



ప్రముఖులను సన్మానిస్తున్న మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

కవి, రచయిత, నాటక కర్త, పాత్రికేయులు, సంఘసంస్కర్త, విద్యావేత్త అయిన చిలకమర్తి లక్ష్మీనరసింహం చిరస్మరణీయులని, ఆయన్ను అఖండమైన కీర్తి తెచ్చింది ఆయన రాసిన గయోపాఖ్యాన నాటకమేనని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కడప రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో సోమవారం చిలకమర్తి 78వ వర్ధంతిని ఘనంగా నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకమర్తి 22 సంవత్సరాల వయస్సులో రాసిన గయోపాఖ్యానం ప్రతులు అప్పట్లోనే లక్షకు పైగా అమ్ముడుపోవడం విశేషం అన్నారు. మధురకవి డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి ప్రసంగిస్తూ ఆంధ్ర మిల్టన్‌గా ప్రసిద్ధులైన చిలకమర్తి ఆ కాలంలోనే దళితులకు ప్రత్యేక పాఠశాలను ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. డాక్టర్ పాలెం వేణుగోపాల్ మాట్లాడుతూ ఆయన ఎన్ని కథలు, నవలలు, నాటకాలు, అనువాదాలు రాసిన గయోపాఖ్యానమే మంచి కీర్తి తెచ్చింది అన్నారు. సత్యనారాయణ చిలకమర్తి ఆసువుగా చెప్పిన పద్యాలనుచక్కగా ఆలపించారు. గయోపాఖ్యానం నాటకం లో ప్రసిద్ధ పాత్రలు పోషించి పేరు తెచ్చుకున్న ఆమూరు విశ్వనాథరెడ్డి,భూమిరెడ్డి పోలిరెడ్డి, సురభి రామచంద్రయ్య, కర్నాటి నరసింహ రెడ్డి, పట్నం సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. రంగస్థల కళాకారులైన మందల మురళి, బ్యాంకు గంగయ్య, తిప్పలూరు ఓబులేసు, బాల ఓబయ్య, శ్రీనివాసరాజు, తపలిస్ట్ గంగయ్య, రవీంద్రనాథ్ రెడ్డి గయోపాఖ్యానం నాటకంలోని పద్యాలను మధురంగా గానం చేశారు.

ఆహారం కల్తీమయం.. ప్రజారోగ్యంతో చెలగాటం

హోటళ్లు, ఇతర దుకాణాల్లో అధికారుల నామమాత్రపు తనిఖీలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హోటళ్ల మాటున కల్తీ మాయ, బయట దొరకని నాణ్యమైన ఆహారంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ, రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకంతో సరికొత్త రోగాలు దరిచేరుతున్నాయి. గతంలో ఎక్కడికైనా వెళ్లి భోజనం సమయానికి ఇంటికి రాలేని పరిస్థితులు తలెత్తితే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికే వచ్చి భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తినేందుకు వారు ఇష్టపడరు. తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. ఇది ఆర్థికంగానూ, ఆరోగ్యం గానూ మంచి లక్షణమే. ఇప్పుడు ఆ పరిస్థితులులేవు. సమాజంలో మనిషి ప్రవర్తనలో చాలా తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా పార్టీ కల్చర్ వచ్చింది. బర్త్ డే, మ్యారేజ్, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్ తదితర సందర్భం ఏదైనా పార్టీలు ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే హోటళ్లల్లో ఆహారం తినడానికే ప్రాధాన్యతనిస్తున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే భోజనాలు బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు. ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా.. లేదా.. అనేది గ్రహించలేకపోతున్నారు. నిల్వ ఉంచిన ఆహారం, ప్రమాదకర రసాయనాలు కలిపిన ఆహారాన్ని తీసుకుంటున్నారు. అప్పటికప్పుడు వీటి వల్ల నష్టం లేకపోయినా దీర్ఘకాలంలో ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. ఆ శాఖలో నిర్ణీత రుసుం చెల్లించి అనుమతి పొందాలి. కానీ పట్టణంలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. ఇదిలా ఉండగా పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డు పక్క హోటళ్లు పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడడం, రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగు కాలువలు, చెత్త కుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా అడిగే వారు కరువయ్యారు. కల్తీ జరుగుతోంది. ఇలా పాలల్లో కుళాయిలు, బోరు నీటిని కలుపుతారు. పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాల పౌడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు. టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు మిశ్రమం చేస్తున్నారు. వీటివల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం లేకపోలేదు. పశువుల ఎముకలను సేకరించి, వాటిని బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీస్తున్నారు. ఆ ద్రావణాన్ని సాధారణ నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీనివల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్లలో ఆకట్టుకునేందుకు హానికరమైన రంగులను ఎక్కువగా వాడుతున్నారు. అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలను వధించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు.





నీట్ పరీక్ష ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నీట్ - 2024 పరీక్ష ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నందున పరీక్ష నిర్వహణ తీరుపై సిట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కడప జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద సోమవారం వారు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఎన్టిఎ (నేష నల్ టెస్టింగ్ ఏజెన్సీ) పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం గల ఒకే సీరియల్ నెంబర్లతో కూడిన ఉన్న విద్యా ర్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారన్నారు. దేశ వ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్ష నిర్వహణ ఎన్‌టిఎ వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు తుడుం ఎల్లయ్య, పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, పట్టణ కమిటీ సభ్యులు ఉదయ్, నాయకులు కృష్ణారెడ్డి, ఓబులేష్, హాజీ, చైతన్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ శివకుమార్, నాయకులు

ఆర్‌జెడిపై నిందలు వేయడం తగదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించే విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డిపై కొంతమంది నాయకులు అభాండాలు వేయడం తగదని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కత్తి ఓబులేసు తెలిపారు. స్థానిక ఆంధ్రకేసరి రోడ్డులోని ప్రజాసంఘాల కార్యాలయంలో సోమవారం విద్యార్థి యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరులతో సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఓబులేసు, రాయలసీమ విద్యార్థి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్, ఆల్ ఇండియా స్టూడెంట్ యూనియన్, జిల్లా అధ్యక్షుడు కొడవటిగంటి నాగరాజు, ఏపీ ఎంఆర్పిఎస్ నియోజవర్గ అధ్యక్షుడు గద్దం నర సింహులు మాట్లాడుతూ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి గత కొంత కాలంగా ఆర్‌జెడి రాఘవ రెడ్డిపై నిందారోపణలు చేస్తున్నారన్నారు. ముక్కు సూటిగా విద్యావ్యవస్థను ఒక పద్ధతిలో గాడిన పెట్టాలని తన ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తిస్తున్న ఆర్‌జెడిపై అవినీతి ఆరోపణలు చేయడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి యువజన నాయకులు పుల్లయ్య, శేఖర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ యూనియన్‌కు విరాళం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

స్థానిక ఎస్‌టియు యూని యన్‌కు వైయస్ వెంకటరెడ్డి విరాళాన్ని అందజేశారు. సోమవారం రిలయన్స్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న తులసి ప్రతాప్ ఫంక్షన్ హాల్‌లో ఉపాధ్యాయ యస్‌టియు యూనియన్ సభ్యులకు వెంకటరెడ్డి రూ.20వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి చెడులను విద్యార్థి దశ నుంచి వివరించే ఉపాధ్యాయులకు విరాళాన్ని ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఉపా ధ్యాయులు దాదాపీరా, కృష్ణ, దుష్యంత్ నాథ్‌రెడ్డి, కైలాస్ నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



సత్కారాన్ని అందుకుంటున్న జలకనూరి మురళీధర్ రాజు

మురళీధర్ రాజుకు శ్రీశ్రీ కళావేదిక సత్కారం

ప్రజాశక్తి-పీలేరు

శ్రీశ్రీ కళావేదిక నిర్వహించిన కవి సమ్మేళనంలో పీలేరుకు చెందిన పద్య కవి జలకనూరి మురళీధర్ రాజు సన్మాన, సత్కారాన్ని అందుకున్నారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్ట్స్ బ్లాక్ తెలుగు శాఖ ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ ఛైర్మేన్ కత్తిమండ ప్రతాప్, రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శి దనాసి, ఉషారాణి ఆధ్వర్యంలో 135వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరిగింది. శ్రీశ్రీ కళావేదిక ఆహ్వానం అందుకున్న పీలేరు "తెలుగు భాషా సమితి" నిర్వాహకులు జలకనూరి మురళీధర్ రాజు కార్యక్రమంలో పాల్గొని "జల సంరక్షణ" పై తాను రాసిన కంద పద్యాన్ని గానం చేసి వినిపించిన ఆయనకు గౌరవప్రదంగా శాలువా, జ్ఞాపిక, ప్రశంశాపత్రంతో సత్కరించారు. కార్యక్రమంలో ఆ సంస్థ అధిపతి కత్తిమండ ప్రతాప్, నిర్వాహకులు ధనాశి ఉషారాణి, కన్వీనర్ కొల్లి రమావతి, హేమమాలిని పాల్గొన్నారు.

కార్యకర్తల శ్రేయస్సే ఎమ్మెల్యే లక్ష్యం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కార్యకర్తల శ్రేయస్సు కోసం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి మొదటి ప్రాధాన్యతనిస్తారని వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, బి.కొత్తకోట వైసిపి పట్టణ అధ్యక్షులు సి.ఆర్.చిన్నికృష్ణ పేర్కొన్నారు. సోమవారం వారు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులు, కార్యకర్తల సహకారంతో తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా రెండవసారి పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయిందన్నారు. ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత మంగళవారం మదనపల్లి పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు ఆయనను కలవచ్చని తెలిపారు. గతంలో తరహాలోనే తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని ఆయన అన్నివిధాల అభివృద్ధి చేస్తారని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు ఖలీల్ అహ్మద్

క్రైం కార్నర్



మాట్లాడుతున్న డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి

తండ్రి హత్య కేసులో కూతురు అరెస్టు : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కన్నతండ్రి హత్య కేసులో సోమవారం ఒకటో పట్టణ పోలీసులు నిందుతురాలైన కుమార్తెను అరెస్టు చేశారు. డిఎస్‌పి ప్రసాద్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు..మదనపల్లె పిఎన్‌టి కాలనీ ఆంజనేయస్వామి గుడి వీధిలో నివాసముంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు ద్వారస్వామి (62) కుమార్తె హరితతో గత కొంతకాలంగా పెళ్లి విషయమై గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం తండ్రీ కుమార్తె ఇద్దరు గొడవ పడ్డారు. పెళ్లి విషయమై జరిగిన ఈ ఘర్షణలో ఇద్దరు పరస్పరం దాడులకు తెగబడ్డారు. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన కుమార్తె హరిత చపాతీ కర్ర, రైటింగ్ ప్యాడ్లతో తండ్రి తలపై పలుమార్లు విచక్షణా రహితంగా దాడి చేసి కొట్టి హతమార్చింది. బంధువుల సమాచారం మేరకు డిఎస్‌పి, సిఐలు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం మృతుడి కుమార్తె హరితను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. విచారణలో తన తండ్రిని తానే హత్య చేసినట్టు ఒప్పుకోవడంతో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



మాట్లాడుతున్న సిఐ శేఖర్

ఫైనాన్స్ సొమ్ముతో ఉడాయించిన మరో వ్యక్తి...

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఫైనాన్స్ సొమ్ముతో ఉడాయించిన వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సిఐ శేఖర్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం, కరూరు జిల్లా, చిన్న ముక్కం బాడికి చెందిన రామచంద్ర పట్టణంలోని దేవతానగర్ నందు ఉన్న ఓ రిజిస్టర్డ్ ఫైనాన్స్ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ గా పని చేస్తున్నాడు. మేనేజర్ కార్తీక్ సెలవులో వెళ్లిన సమయంలో రామచంద్ర రూ.7 లక్షలు ఖాళీ చేసినట్లు తెలిపారు. మేనేజర్ కార్తీక్ ఫిర్యాదుతో చీటింగ్ కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితున్ని బసినికొండ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి బస్టాండ్ సమీపంలో సోమవారం పట్టణానికి చెందిన మహమ్మద్ యాసీన్ అనే యువకుడు కత్తితో తన చేతిని కోసుకొని ఆత్మ హత్యకు యత్నించగా వెంటనే పక్కనే ఉన్న స్నేహితులు, పోలీస్ సిబ్బంది అడ్డుకున్నారు. బాధితుడు తెలిపినవివరాల మేరకు.. పట్టణంలోని మసాపేటకు చెందిన ఓ యువతిని కొన్నేళ్లుగా ప్రేమిస్తున్నానని, బక్రీద్ పండగ సందర్భంగా ఆ యువతికి శుభాకాంక్షలు తెలపడానికి ఫోన్ చేయగా ఆమె సమాధానం రాలేదని తెలిపారు. దీంతో ఆత్మ హత్య చేసుకోవాలని నిర్ణయించు కున్నట్లు తెలిపారు. అతన్ని వెంటనే కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ అత్యవసర చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.